ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- గోవర్ధనగిరిలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు

పిచ్చాటూరు: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలతో పాటు మెరుగైన పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మండలంలోని గోవర్ధనగిరి పంచాయతీలో మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడుతో కలిసి ఎమ్మెల్యే గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు బరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో పాల సేకరణ కేంద్రం పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు.

ఎన్టీఆర్, వైఎస్సార్ కలిస్తే జగన్‌మోహన్‌రెడ్డి

ఎన్టీఆర్, వైఎస్సార్‌లను కలబోసిన వ్యక్తిత్వం ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలో ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు అన్నారు. ఆ ఇద్దరు ముఖ్యమంత్రులను దగ్గరుండి చూసిన అనుభవంతో ఈ మాటలు అంటున్నానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందించి వారి మెప్పుపొందడం సంతోషంగా ఉందన్నారు. తన కోరిక మేరకు స్వగ్రామమైన గోవర్ధనగిరికి రూ.కోటి విలువచేసే గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఆదిమూలానికి కృతజ్ఞతలు తెలిపారు.

దేశానికే ఆదర్శంగా పథకాలు

అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం మండలంలోని గోవర్ధనగిరి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడుతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గోవర్ధనగిరి, హరిజనవాడ, ఎస్టీ కాలనీ, నారాయణరాజుకండ్రిగ, ఓబుల్‌రాజు కండ్రిగ గ్రామం ఏఏడబ్ల్యూలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందజేసి సంక్షేమ లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ అనుమతి కావాల్సి వచ్చేదని, నేడు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కందేరి కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ హెచ్ రేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎంఈఓ హేమమాలిని, ఏపీఎం వనిత, వైద్యాధికారి గాయత్రి, ఏఓ సంజీవరెడ్డి, సర్పంచ్‌లు శివరామకృష్ణ నాయుడు, మోహన్ నాయుడు, కేజీ రోస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేలు, రమేష్ రాజు, శోభన్, పాలపద్మనాభం, శేఖర్ రెడ్డి, బాలాజీ నాయుడు, యుగంధర్, కృష్ణ, ప్రభాకర్, శేఖర్, మోహన్, చలపతిరాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకు

నారాయణవనం: మండలంలోని కొండలచెరువు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కొండలచెరువు పంచాయతీ పరిధిలోని జోగిళ ఇళ్ల గ్రామంలో, నాలుగు గంటలకు కల్యాణపురంలో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ఏర్పేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల తనిఖీల బహిరంగ సభ జరుగుతుందని శుక్రవారం ఎంపీడీఓ గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై 14, 15 విడతల సామాజిక తనిఖీలు ఈ నెల 1 నుంచి 12 వరకు నిర్వహించినట్లు వివరించారు. సామాజిక తనిఖీలలో వెలుగుచూసిన అవినీతి అక్రమాలపై సంబంధిత డీఆర్పీలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ సభకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఉపాధి హామీ కూలీలు హాజరుకావాలన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన


సూచనలిస్తున్న వ్యవసాయాధికారి భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడులో శుక్రవారం మినుము పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు మండల వ్యవసాయాధికారి భారతి అవగాహన కల్పించారు. పల్లాకు తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా తెలిపారు. లేత ఆకుల్లో పసుపు రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండి పోతాయని, తెగులు నివారణకు అసిఫేట్ గ్రాము, లేదా మోనోక్రోటోపాస్ 16 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో బోర్లు


శ్మశాన వాటికలో బోరు డ్రిల్లింగ్

ఏర్పేడు: స్థానిక పంచాయతీ పరిధిలోని మూడు శ్మశాన వాటికల్లో శుక్రవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో బోర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి బోర్లు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షమ్మ గ్రామోత్సవం


అమ్మవారి ఊరేగింపు

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో నూతనంగా నిర్మించిన శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి దాటాక అంబూరు గ్రామ పురవీధుల్లో ప్రత్యేక పుష్పాలంకరణతో అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఇంటింటి వద్ద అమ్మవారి కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త సాయిరెడ్డి, ప్రధాన ఆలయ నిర్మాణ దాత ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

చేతిపంపులకు మరమ్మతులు


చేతిపంపు మరమ్మతులు చేస్తున్న మెకానిక్

ఏర్పేడు: మండలంలోని కోబాక పంచాయతీ పరిధిలోని కోబాకమిట్ట, ఎస్టీ కాలనీలో శుక్రవారం సర్పంచ్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో చేతి నీటి పంపులకు మరమ్మతులు చేశారు. రెండు రోజుల క్రితం చేతిపంపులు మరమ్మతులకు గురికావడంతో గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు చెంగల్రాయులు, పంచాయతీ కార్యదర్శి లోకముని పాల్గొన్నారు.

ఏకం ఆలయంలో భక్తుల సందడి


అమ్మా భగవాన్‌లకు హారతి ఇస్తున్న తనయుడు కృష్ణాజీ, దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని ఏకం(వన్‌నెస్) ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. తమిళనాడులోని వెస్ట్ చెన్నై ప్రాంతాల నుంచి 25వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఆలయంలోని గోల్డెన్ బాల్ వద్ద భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు దర్శనమిచ్చి ఆశీస్సులు అందజేశారు. ఉదయం 8 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. క్యూల్లో వచ్చే భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు ఆశీస్సులు అందజేశారు. తొలుత ఏకం ఆలయంలో అమ్మా భగవాన్‌లకు వారి తనయుడు కృష్ణాజీ హారతులిచ్చి దర్శనాలను ప్రారంభించారు. సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, స్థానిక ఎస్ఐ నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు భోజన వసతులు, ఇతర సౌకర్యాలను ఏకం ప్రతినిధులు ఏర్పాటు చేశారు. లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, ప్రతినిధులు సునీల్ జీ, ఉమాపతి దాసాజీ, రుద్ర దాసాజీ, శ్రీరామ్మూర్తి దాసాజీ ఎప్పటికప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

ఏటీఎం కేటుగాడు

- బెయిల్‌పై వచ్చి మళ్లీ హస్తలాఘవం
- వల పన్ని అరెస్ట్ చేసిన ఎస్ఐ
- గంజాయి, నగదు స్వాధీనం


మునిసుబ్రమణ్యం (ఫైల్)

వడమాలపేట: డబ్బులు డ్రా చేసిస్తా..పిన్ నంబర్ జనరేషన్ చేసిస్తా..అని ఏటీఎంల వద్ద కార్డులు మార్చి, డబ్బులు కొట్టేస్తున్న ఓ కేటుగాడిని వలపన్ని వడమాలపేట పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద ఇది చోటుచేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. ఏర్పేడు మండలం కందాడకు చెందిన పిండి ముని సుబ్రమణ్యం(40) ఒక జులాయి. ఏటీఎంల వద్ద ప్రజలను ఏమార్చి, వారి కార్డులు మార్చేసి, డబ్బులు డ్రా చేసి జల్సా చేయడమే ఇతడి ప్రవృత్తి. మూడు రోజుల క్రితం మండలంలోని పాదిరేడు దళితవాడకు చెందిన వాసు కొత్త ఏటీఎం కార్డు పిన్ నంబర్ జనరేట్ చేసుకోవడానికి స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చాడు. అక్కడే ఉన్న సుబ్రమణ్యంకు పిన్ నంబర్ జనరేషన్ చేసి ఇవ్వమని కోరాడు. ఇదే అవకాశంగా ఆ కేటుగాడు ఆ కార్డుకు పిన్ జనరేషన్ చేస్తున్నట్లు నటించాడు. కార్డు పనిచేయడం లేదంటూ తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డు ఇచ్చి పంపించేశాడు. అతను వెళ్లిన తర్వాత వాసు ఏటీఎం కార్డుతో రోజుకు రూ.40వేల చొప్పున 1,20,000 డ్రా చేశాడు. తన అకౌంట్ నుంచి ఎవరో డబ్బులు డ్రా చేశారని తెలుసుకున్న వాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఏటీఎం వద్ద నిఘా ఉంచారు. అలాగే అక్కడి సీసీ కెమెరాలలో నమోదైన దృశ్యాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. ఏటీఎంకు వచ్చిన సుబ్రమణ్యంను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 200 గ్రాముల గంజాయి, రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై ఇప్పటికే శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు, పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదై ఉన్నాయని, 2017 నుంచి ఇతడు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అంతేకాకుండా బెయిల్ పొంది వచ్చినా అతడి తీరు మారలేదు. అరెస్ట్ చేసిన నిందితుడిని కోర్టుకు తరలించారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు



వరి పంటను ఆశించిన తెగులును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు లక్ష్మీప్రసన్న, రాఘవేంద్ర

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వరి పైరులో తెగుళ్ల నివారణకు పలు చర్యలు తీసుకోవాలని చిత్తూరు డాట్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తలు లక్ష్మీ ప్రసన్న, రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని పూడి, పెన్నలపాడు గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నాగోల్ సురేందర్ రెడ్డితో కలిసి వరి పంటను పరిశీలించారు. రైతులు అధికంగా ఎరువుల వాడకం వల్ల, వాతావరణంలో మార్పుల వల్ల పంటకు తెగులు సోకుతుందని తెలిపారు. వరి పంట రకాలైన ఎంటీయూ- 1262లో అగ్గి తెగులు, పాముపోడ తెగులు ఎక్కువగా సోకుతుందని వివరించారు. అనంతరం తెగులు సోకిన పంట శ్యాంపిల్స్‌ను డాట్ సెంటర్‌లో పరీక్షించేందుకు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని పాయ్య, చిన్నసింగమాల, లింగమనాయుడుపల్లి, రౌతుసూరమాల తదితర గ్రామాల్లో శుక్రవారం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలిసి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నీటిని నిల్వ చేయడం వల్ల దోమలు వృద్ధి చెంది, డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. వేపాకు పొగ వేయడం, బంతి, తులసి, పుదీనా, వంటి మొక్కలను పెంచితే ఘాటైన వాసనకు దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగరాజమ్మ, ఆశా కార్యకర్త నాగభూషణమ్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్‌ను బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో క్రై, ప్రగతి, పోర్డ్ స్వచంధ సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. లలితమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాల్లో దక్షిణ భారత్‌లోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 29 శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాలికల సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 934 మంది మాత్రమే మహిళలు ఉన్నారని చెప్పారు. ఈ గణాంకాల ప్రకారం మహిళలు ఎంత వివక్షకు గురవుతున్నారో అర్థమవుతోందన్నారు. ఆడపిల్లలు లేకపోతే సమాజంలో మనుగడే ఉండదన్నారు. మూఢనమ్మకాలు, మూఢాచారాలు, కులతత్వం వంటివి మహిళలకు శాపంగా మారాయన్నారు. ఆడపిల్లలకు విద్య ఎంతో అవసరమన్నారు. అంతకు ముందు ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో నేటికీ 80శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఇవి వారిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వందల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగేవన్నారు. అయితే ప్రస్తుతం అధికారులు, పాలకుల చొరవతో గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనకు తాము కలసి కట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసిటీ చొరవతో పీహెచ్‌సీకి సెక్యూరిటీ ఏర్పాటు


పీహెచ్‌సీ వద్ద శ్రీసిటీ సెక్యూరిటీ గార్డ్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాత్రివేళల్లో భద్రత నిమిత్తం శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం సెక్యూరిటీని నియమించి చేయూతనిచ్చింది. ఆస్పత్రి సిబ్బందికి రాత్రి వేళల్లో భద్రత కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు లావణ్య, యూడీసీ సోమశేఖర్, స్థానికులు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డికి వినతిపత్రం ద్వారా విన్నవించడంతో తక్షణమే ఆయన సానుకూలంగా స్పందించారు. శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం నుంచి ఒక సెక్యూరిటీ గార్డ్‌ను రాత్రివేళల్లో ఆస్పత్రి వద్ద కాపలా ఉంచి, శ్రీసిటీ ద్వారా వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. శ్రీసిటీ ఎండీ చొరవ పట్ల ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు అభినందనలు తెలిపారు.

ఉపాధి ఏపీఓగా భాస్కరయ్య



వరదయ్యపాళెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా భాస్కరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యవేడు నుచి ఆయన ఇక్కడికి రాగా, ఇక్కడ పనిచేస్తున్న దీప వెంకటగిరికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన భాస్కరయ్య మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచుతామని, పనులను లక్ష్యం మేరకు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం 6, 7, 11, 12, 15వ వార్డుల పరిధిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు బియ్యపు పవిత్రారెడ్డి సూచనల మేరకు తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలదంకి మదన్ మోహన్‌రెడ్డి, హరినాథ్, మురళి, దీపిక, జయశ్రీ, లత, గురునాగరాజు, సాగీర్‌బి, షర్మిల, పుట్ట హరినాథ్ తదిరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, కృష్ణతేజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలోని 100 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ శిరీషరావు, పీఆర్వో వెంకటేష్, ఎన్ఎస్ఎస్ పీఓ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీషరావు

నేటి రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి


ఊరేగింపునకు ముస్తాబైన వాహనాలు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్య జయంతిని పురస్కరించుకుని శనివారం రథసప్తమి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను తలపిస్తూ స్వామి వారు వరుసగా ఏడు వాహనాల్లో పుర వీధుల్లో విహరిస్తారని పేర్కొన్నారు. శనివారం వేకువ జామున నిత్య పూజలు, నైవేద్యం అనంతరం సూర్య ప్రభ, పెద్దశేష, హంస, కల్పవృక్ష, చిన్నశేష, తిరుచ్చి వాహనపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. సాయంత్ర కైంకర్యాలు అనంతరం 6.30 గంటలకు చంద్రప్రభ వాహనం సేవ జరుగుతుందని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన


పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నింబుజాదేవి ఆలయం ఆవరణలోని శ్రీఅష్టలక్ష్మి ఉపాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ పూజలకు విచ్చేసిన మహిళా భక్తులకు సౌభాగ్య మాంగల్యదారాలు, కుంకుమను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విశ్రాంత డీఎస్పీ దలవాయి రాఘుజెట్టి, హిందూ ధర్మప్రచార మండి జిల్లా సభ్యులు రాజ్ కుమార్, హిందూధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు, సభ్యులు, డిల్లీకుమార్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

శ్రీకాళహస్తి రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిబంధనలు పాటించాలని శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంవీఐ దామోదర్ నాయుడు మాట్లాడుతూ, ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. ఆర్టీసీ డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం చట్టరీత్యా నేరమన్నారు. ఆర్‌టీసీ డీఎం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో అతివేగవంతంగా నడిపేందుకు అవకాశమున్న రహదారులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


సమావేశంలో మాట్లాడుతున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: క్రీడా పోటీలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో విక్రమ్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు నేటి తరానికి ఎంతో అవసరమన్నారు. దీని వల్ల మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తుందని చెప్పారు. శ్రీకాళహస్తిలో విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ క్రీడల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి క్రీడల అభివృద్ధి కోసం పట్టణంలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


జెండా ఆవిష్కరిస్తున్న ఈశ్వరసింగ్ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం శ్రీబాలజ్ఞానాంబిక ఎలక్ట్రిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్‌డే ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు ఈశ్వర్‌సింగ్ మాట్లాడుతూ అందరికీ వెలుగులు నింపే ఎలక్ట్రీషియన్లు మాత్రం చీకట్లోనే ఉండిపోతున్నారని చెప్పారు. అలా కాకుండా కలసికట్టుగా జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని సూచించారు. అనంతరం గుర్తింపుకార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాషా, ఇబ్రహీం, ముత్యాలయ్య, శివకుమార్, లక్ష్మణ్‌రెడ్డి, శంకర్, మహబూబ్‌బాషా, మునిరాజా, ఖలీల్ అహ్మద్, రియాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వికాసంతో సమాజంలో గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు మేనేజర్ శివశంకర్

రేణిగుంట: పేద ప్రజల జీవితాల్లో ఆర్థికంగా పురోభివృద్ధి సాధించినప్పుడే వారికి సమాజంలో సముచిత గుర్తింపు లభిస్తుందని కరకంబాడీ కెనరా బ్యాంకు మేనేజర్ శివశంకర్ అన్నారు. రాస్ బాలాజి బాలవికాస్ కార్యాలయంలో చైల్డ్‌ఫండ్ ఇండియా సహకారంతో శుక్రవారం దత్తత గ్రామాలకు చెందిన 30మంది పేదలకు మేకలు, గొర్రెలు, పాడి పశువులు, చిల్లర దుకాణాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించారు. రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ జయచంద్రనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాము అందించిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాదులను పెంపొందించుకోవాలని వారు కోరారు. పాడి పశువులు, మేకలు, గొర్రెలు పెంపకంలో పాటించాల్సిన మెళుకువలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ


ఎంపీపీని సన్మానిస్తున్న స్థానికులు

రేణిగుంట: మండల కేంద్రంలోని బాలాజీ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. స్థానిక నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం కోసం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ద్వారా సమస్యను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రూ.12లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ సీనియర్ నాయకుడు జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, గోపి, కిరణ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి


పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు నేడు పనులు పరిశీలిస్తున్న రామచంద్రారెడ్డి

ఏర్పేడు: నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్రిమంద ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్షా కా పే చర్చ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడే ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఎల్ఓ శ్రీధర్, అసిస్టెంట్ ఏఎంఓ మధు, అసిస్టెంట్ సీఎంఓ రాము, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.